క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ

బొంరాస్‌పేట: అనారోగ్యంతో బాధపడుతున్న రేగడిమైలారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకుడు నర్సిరెడ్డిని సోమవారం ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పరామర్శించారు.

ఘనంగా రుద్రాభిషేకం



పూజా కార్యక్రమంలో చైర్‌పర్సన్ దంపతులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం కొత్తగడి వీరాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల దంపతులు పూజలు చేశారు. స్వామి వారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామికి నైవేద్యం సమర్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అనంత పద్మనాభుడి జాతర

ఏర్పాట్లు ముమ్మరం చేసిన అధికారులు



అనంతగిరిగుట్టలో కొలువైన పద్మనాభుడు

అనంతగిరి: వికారాబాద్ పట్టణానికి సమీపాన ఉన్న అనంతగిరి గుట్టలో వెలసిన అనంత పద్మనాభ స్వామివారి కార్తీకమాస పెద్ద జాతర రేపటి నుంచి ప్రారంభం కానుందని ఆలయ ధర్మకర్త ఎస్.పద్మనాభం, ఈఓ నరేందర్ తెలిపారు. వేడుకలు డిసెంబర్ 7వరకు జరగనున్నాయని చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా తొలుత బుధవారం సాయంత్రం 4 గంటలకు ధ్వజారోహనంతో ప్రారంభం కానుంది. 23న కార్తీక ఏకాదశి ఉత్సవం, 24న రాత్రి 7 గంటలకు తులసి వివాహం జరగనుంది. 27న పౌర్ణమిని పురస్కరించుకుని సాయంత్రం 6.30 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, రాత్రి 9.30 గంటలకు రథోత్సవం ఉంటుందని తెలిపారు. 28న ఉదయం 11గంటలకు గరుడ వాహన సేవ, 29న ఉదయం 11గంటలకు ముత్యాల పందిరి వాహనసేవ, 30న ఉదయం 11 గంటలకు గజ వాహనోత్సవం నిర్వహించనున్నారు. డిసెంబర్ 7న ఉదయం 11గంటలకు చక్రతీర్థంతో వేడుకలు ముగియనున్నాయని వారు వెల్లడించారు. యేటా కార్తిక మాసంలో 15 రోజుల పాటు జాతర జరుగుతుందని, ఉత్సవాలకు రాష్ట్ర నలుమూల నుంచే కాకుండా, ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు రానున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ట్రాక్టర్ కింద పడి కార్మికుడు మృతి



హరిప్రసాద్ మృతదేహం

మర్పల్లి: ప్రమాదవశాత్తు పారిశుద్ధ్య కాంట్రాక్ట్ (దినసరి కూలి) కార్మికుడు ట్రాక్టర్ కింద పడి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పిట్టల హరిప్రసాద్(65) నాలుగు నెలలుగా మర్పల్లి గ్రామ పంచాయతీలో దినసరి కూలీగా పని చేస్తున్నాడు. విధినిర్వహణలో భాగంగా రైల్వే స్టేషన్ ఎదుట ఆర్‌అండ్‌బీ రోడ్డులో హరితహారం మొక్కలకు నీరు పట్టేందుకు జీపీ ట్రాక్టర్లో వెళ్తున్న క్రమంలో.. డ్రైవర్ మైపాల్ అజాగ్రత్త వలన ట్రాక్టర్‌పై కూర్చున్న హరిప్రసాద్.. కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ హరిప్రసాద్ మృతి చెందాడు. మృతుడి భార్య జోగాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సెల్‌ఫోన్ రికవరీ



బాధితురాలికి సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఎస్‌ఐ గిరి

పూడూరు: దొంగిలించబడిన సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ యాప్‌ద్వారా కనుగొని, బాధితురాలికి అప్పగించిన సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ వనజకు చెందిన సెల్‌ఫోన్ వారం క్రితం చోరీకి గురైంది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ ద్వారా ఫోన్‌ను కనుగొని బాధితురాలికి అందజేశారు.

ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం



యాలాల: సంగెంకుర్దులో ప్రచారం చేస్తున్న ఎంపీపీ తదితరులు



తాండూరు రూరల్: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

- అభివృద్ధిలో రాజీపడం
- సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ నంబర్ వన్
- ఇంటింటి ప్రచారంలో గులాబీ శ్రేణులు
- వారంటీ లేని గ్యారంటీలను ప్రజలు నమ్మరు: ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

యాలాల: ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారని, అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళ్లారని యాలాల ఎంపీపీ తాళ్లపల్లి బాలేశ్వర్‌గుప్తా అన్నారు. సోమవారం మండల పరిధి సంగెంకుర్దు గ్రామంలో తాండూరు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ అనంతయ్య ముదిరాజ్‌తో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరంతరం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేసిందని పేర్కొన్నారు. రైతుబంధు, రైతుబీమా, ఆసరా పింఛన్లు లాంటి పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని వెల్లడించారు. అంతే కాకుండా ప్రతి పంచాయతీకి రూ.50లక్షల నిధులను ఏక కాలంలో మంజూరు చేసిన ఘనత ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికే దక్కిందని తెలిపారు. ఇలాంటి అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటు వేసి, సీఎంగా కేసీఆర్, ఎమ్మెల్యేగా రోహిత్‌రెడ్డిని ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాలరాజ్, కిష్టాపూర్ సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, ముదిరాజ్ సంఘం నాయకులు లాలప్ప ముదిరాజ్, బాయిమీది అశోక్ తదితరులు ఉన్నారు.

గ్యారంటీలను నమ్మరు

బషీరాబాద్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన వారంటీలేని గ్యారంటీలను ప్రజలు నమ్మరని, అసలు ఆ పార్టీకి ఓట్లు అడిగే హక్కులేదని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో భోజ్యానాయక్‌తండాకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా.. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. యువత బీఆర్‌ఎస్ వైపే మొగ్గుచూపుతుందని, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలవటం ఖాయమన్నారు.

స్థానిక ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత

- 40 శాతం టికెట్లు వారికే కేటాయింపు
- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు రూరల్: తనను గెలిపిస్తే వచ్చే పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంత యువతకు 40 శాతం టికెట్లు కేటాయిస్తానని బీఆర్‌ఎస్ తాండూరు అసెంబ్లీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి అన్నారు. సోమవారం తాండూరు మండలం పరిధి పలు గ్రామాల నుంచి భారీగా యువకులు ఎమ్మెల్యే సమక్షంలో అధికార పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడారు. యువతకు పార్టీలో తగిన ప్రాధాన్యత ఇస్తానని, అదే కాంగ్రెస్‌లో గుర్తింపు ఇవ్వరని పేర్కొన్నారు. యంగ్ లీడర్ పేరిట యువకులను ప్రోత్సహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాధవరెడ్డి, గౌతపూర్ సర్పంచ్ రాజప్ప గౌడ్, మాజీ ఎంపీటీసీ వెంకటేశం, నాయకులు శ్రీను ఉన్నారు.

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ శర్మ



వికారాబాద్ అర్బన్: ఫాం 12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న 80 సంవత్సరాల వయోవృద్ధులు, 40 శాతం కన్నా ఎక్కువ అంగవైకల్యం ఉన్న వికలాంగులు తమ ఓటు హక్కును ఈ నెల 23న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వినియోగించుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ శర్మ కోరారు. ఈ మేరకు ఆయన మాట్లాడారు. ఓటర్ల ఇంటి వద్దకే పోలింగ్ అధికారులు వచ్చి, బ్యాలెట్ పత్రాలను అందజేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అత్యవసర సేవలు అందించే ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును 24 నుంచి 26 వరకు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వికారాబాద్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లో వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పోలింగ్ అధికారులు.. పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటును జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెలిసిటేషన్ సెంటర్లో నేటి నుంచి నుంచి 24 వరకు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు తమ ఓటును 27 నుంచి 29 వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో వేయాలని రాహుల్ సూచించారు.

యువతను పట్టించుకోని ప్రభుత్వం

- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ
- అర్హులకు ఆరు గ్యారంటీలతో పాటు.. ఇళ్లు మంజూరు
- ఇంటింటి ప్రచారంలో హస్తం శ్రేణులు



యాలాల: కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ గౌడ్



బషీరాబాద్: ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

యాలాల: బీఆర్‌ఎస్ ప్రభుత్వం యువతను నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డి తనయుడు శివకుమార్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోసపూరిత మాటలతో నిరుద్యోగులను సీఎం కేసీఆర్ మోసం చేశారని విమర్శించారు. ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా, నిరుద్యోగాన్ని పెంచిపోషించారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. ఇలా అన్ని వర్గాల వారి జీవితాలతో ఆటలాడుకున్న బీఆర్‌ఎస్ గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ శ్రమించాలని కోరారు. పార్టీ అధికారంలోకి రాగానే నిరుద్యోగుల కోసం మెగా డీఎస్సీతో పాటు, ఉద్యోగాల నోటిఫికేషన్లు జారీ చేస్తుందని పేర్కొన్నారు. పార్టీ నేత, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్ మాట్లాడుతూ యువత కాంగ్రెస్ పార్టీ వైపే మొగ్గుచూపుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో యువజన విభాగం నియోజకవర్గ కన్వీనర్ ప్రశాంత్, యువజన విభాగం మండల అధ్యక్షుడు బస్వరాజ్, మాజీ అధ్యక్షుడు మన్నాన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ గ్యారంటీలు

బషీరాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అర్హులందరికీ ఇళ్లు వస్తాయని ఎంపీపీ కరుణ అన్నారు. మండల పరిధి మంతట్టిలో ఆమె పార్టీ కార్యకర్తలో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ వస్తే అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. చేతి గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా బుయ్యని మనోహర్‌రెడ్డిని గెలిపించాలని ఆమె కోరారు. ఎంపీటీసీ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు

బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు సమన్యాయం

- కేసీఆర్‌కు పట్టం కట్టనున్న ప్రజలు
- జెడ్పీటీసీ హరిప్రియ



ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ హరిప్రియ

పరిగి: ఉనికిని చాటుకునేందుకు ప్రతిపక్ష పార్టీలు.. అమలు సాధ్యంకాని హామీలతో ప్రజలను మభ్యపెడుతున్నాయని, కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని జెడ్పీటీసీ హరిప్రియ అన్నారు. సోమవారం ఆమె మండల పరిధి రాఘవపూర్ గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఓటమి భయంతో ప్రధాన ప్రతిపక్షాలు ఇష్టానుసారంగా వ్యహరిస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ రాక ముందు వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్.. రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. గత ప్రభుత్వాల పాలనను, ముఖ్యమంత్రి కేసీఆర్ పనితీరును ప్రజలు పోల్చి చూడాలని సూచించారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత మన బతుకులు మారాయని, అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకొని సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలు చేశారని వెల్లడించారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందని ఇళ్లు లేదని, మెజార్టీ ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. ముచ్చటగా మూడోసారి కేసీఆర్‌కు పట్టం కట్టనున్నారని పేర్కొన్నారు. ఇందులో పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, సర్పంచ్ జగన్, ఎంపీటీసీ ఉమా, పీఏసీఎస్ డైరెక్టర్ హన్మంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తి సాగు బాగు



సాగు దిగుబడి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖాధికారులు

- తగ్గనున్న పంటకాలం.. దిగుబడి అధికం
- ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మణ్

తాండూరు టౌన్: అధిక సాంద్రతతో పత్తిని సాగు చేయడం ద్వారా పంట కాలాన్ని తగ్గించుకోవటమే కాకుండా.. అధిక దిగుబడిని పొందవచ్చని ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ టి.లక్ష్మణ్ అన్నారు. సోమవారం తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాటన్ రీసెర్చ్ ప్రత్యేక ప్రాజెక్టులో భాగంగా ఏరువాక, కిసాన్‌మేళా, వ్యవసాయ ప్రదర్శన వంటి వాటిపై నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా సాగు దిగుబడులపై అవగాహన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం రైతులతో లక్ష్మణ్ మాట్లాడారు. కొంత కాలంగా తెల్ల బంగారం దిగుబడి నిలకడగా ఉందని, దిగుబడిని పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పత్తి సాగులో మెరుగైన సూచనలను, సలహాలను తీసుకోవాలని చెప్పారు. వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సి.సుధారాణి మాట్లాడుతూ సరైన పద్ధతులను పాటించి దిగుబడిని పెంచవచ్చన్నారు. పంట కాలం పూర్తయ్యాక జనవరి మాసంలో రెండో పంటగా మినుములు, పెసర్లు వేసుకుని రైతులు అధిక ఆదాయాన్ని పొందే అవకాశం ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో పరిశోధన, విస్తరణ సలహా మండలి సభ్యుడు నారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, శాస్త్రవేత్తలు డాక్టర్ గుల్జర్ భాను, రఘురాంరెడ్డి, మల్లారెడ్డి, రైతులు, విద్యార్థులు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సుపరిపాలన



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

అనంతగిరి: బీజేపీతోనే సుపరిపాలన సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి అన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆయన సోమవారం వికారాబాద్ మున్సిపల్ పరిధి గిరిగేట్‌పల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా సదానందరెడ్డి మాట్లాడారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని, కావున కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీ అభ్యర్థి నవీన్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు.

పేదల అభ్యున్నతి కాంగ్రెస్‌కే సాధ్యం

పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి టి.రామ్మోహన్ రెడ్డి



పరిగి: పార్టీలో చేరిన వారితో రామ్మోహన్ రెడ్డి

పరిగి: బడుగు బలహీనవర్గాల ఆర్థిక అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఆ పార్టీ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం కుల్కచర్ల మండలం రాంనగర్ సర్పంచ్ రాజు, సిరిగాయపల్లి సర్పంచ్ కవిత కాంగ్రెస్‌లో చేరగా.. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడారు. పార్టీ అధికారంలోకి రాగానే పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కుల్కచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, మహ్మదాబాద్ మండలం ధర్మపూర్ సర్పంచ్ వెంకటయ్య, పార్టీ కుల్కచర్ల మండలం ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, నాయకులు కుమ్మరి స్వామి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పూడూరులో..

పూడూరు: తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, ఈ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన సమక్షంలో సిరిగాయపల్లి సర్పంచ్ పోతర్ల కవిత తదితరులు కాంగ్రెస్‌లో చేరగా.. ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీషరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య, నాయకులు వెంకటదాసు, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణను దోచుకున్న కేసీఆర్

- బంగారు మయం అయింది రాష్ట్రం కాదు.. కల్వకుంట్ల కుటుంబం
- అధికార పార్టీపై కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ ధ్వజం
- నియోజకవర్గాన్ని పట్టించుకోని ఎమ్మెల్యే ఆనంద్: హస్తం శ్రేణులు



ధారూరు: ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



మోమిన్‌పేట: ఎన్కేపల్లి ప్రచారంలో మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్



మర్పల్లి: తుమ్మలపల్లిలో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

మోమిన్‌పేట: తెలంగాణను బంగారు మయం చేస్తానని అధికారం చేపట్టిన బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్.. ఆయన కుటుంబాన్ని బంగారు మయం చేసుకున్నారని కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ అసెంబ్లీ అభ్యర్థి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ఆరోపించారు. సోమవారం మోమిన్‌పేట మండలం చంద్రాయన్‌పల్లి, ఇజ్రా చిట్టంపల్లి, సయ్యద్‌అల్లిపూర్, కేసారం, ఎన్కేపల్లి, మొరంగపల్లి, వెల్‌చాల్, దుర్గంచెర్వు గ్రామాల్లో ఏఐసీసీ సభ్యురాలు డాక్టర్ దాహిద ఖాన్‌తో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పడితే కాపలా కుక్కలా ఉంటానని చెప్పిన కేసీఆర్.. నేడు అధికారం మొత్తం తన గుప్పెట్లో పెట్టుకొని రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో పార్టీ గెలుపు ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారం చేపట్టిన వెంటనే మేనిఫెస్టోతో పాటు ఇచ్చిన మాటా ప్రకారం ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు నరోత్తం రెడ్డి, మహేందర్‌రెడ్డి, మహంత్‌స్వామి, అనందం, శంకరప్ప, ముజీబ్, సురేందర్, బాబు, నర్సింములు, చంద్రయ్య, ప్రభాకర్‌రెడ్డి, వేమారెడ్డి, మల్లయ్య, మానయ్య తదితరులు ఉన్నారు.

ఆనంద్ చేసిందేమీ లేదు..

ధారూరు: ఎమ్మెల్యే ఆనంద్ ఐదేళ్లుగా నియోజకవర్గానికి చేసిందేమీ లేదని, ఆయన ఆస్తులు మాత్రం కూడబెట్టుకున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలో వారు ఇంటింటి ప్రచారం చేశారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు, మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, పార్టీ అధికారంలోకి వస్తే అందరికీ మేలని చెప్పారు. కావున చేతి గుర్తుకు ఓటువేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. పార్టీ మండల నాయకులు అశోక్, ఇబ్రహీం, బుజ్జయ్యగౌడ్, దావూద్, రాజేశ్వర్, ఇనాయతుల్లాఖాన్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

మర్పల్లి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇంటింటికీ ఆరు గ్యారంటీ పథకాలు అందజేస్తామని ఆ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి అన్నారు. మర్పల్లి మండలం తుమ్మలపల్లి గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు రవిందర్, సీనియర్ నాయకులు సుభాష్‌యాదవ్, పంచలింగాల సురేష్‌తో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు, మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడారు. పార్టీ అధికారంలోకి వస్తే అందరికీ మేలన్నారు. చేతి గుర్తుకు ఓటేసి ప్రసాద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు రవిందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేష్, మర్పల్లి మాజీ సర్పంచ్ పాండు, గ్రామ కమిటీ అధ్యక్షుడు సీనియర్ నాయకులు రాజు, మల్లికార్జున గిరి అశోక్, సాయికుమార్ తదితరులు ఉన్నారు.

పేదల పక్షపాతి కాంగ్రెస్

అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ పేదల పక్షపాతి అని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. వికారాబాద్ కొత్తగడి గ్రామంలో నాయకులు, కార్యకర్తలో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చేతి గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి ప్రసాద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఆయన వెంట సీనియర్ నాయకులు కిషన్‌నాయక్, కౌన్సిలర్ ప్రభాకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, దేవిరెడ్యానాయక్, సీనియర్ నాయకులు చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, కిష్టారెడ్డి, శంకర్, ఖాలెద్, మల్లికార్జున్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

కుల్కచర్ల: అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా సోమవారం మండల పరిధి గ్రామాల్లో బీఎల్‌ఓలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఓటరు స్లిప్పులను ఓటర్లకు అందజేశారు. మండల కేంద్రంలో ఇన్‌చార్జి కార్యదర్శి విజయభాస్కర్ స్లిప్పులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓటింగ్ తేదీ సమీపిస్తున్నందున స్లిప్పుల పంపిణీని వేగిరం చేశామని చెప్పారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు వెంకటేశ్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల చట్టంపై అవగాహన అవసరం

దోమ: ఎన్నికల చట్టంలోని సెక్షన్ 49పీ గురించి ప్రజలకు అవగాహన ఉండాలని సమాచార హక్కు చట్టం మండల ఉపాధ్యక్షుడు నర్సింహ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందన ఓటరు జాబితాలో తమ పేరు నమోదు కాకపోవడం, నమోదైనా ఓటు మిస్ కావడం, పోలింగ్ బూత్‌కి వెళ్లే సరికి ఓటును ముందే వేసినట్లు చూపించడం లాంటి సమస్యలు ఉత్పన్నం అవుతుంటాయి. ఈ నేపథ్యంలో సెక్షన్49పీ గురించి తెలుసుకుంటే అనేక సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. మన ఓటును ఎవరైనా ముందే వేసినట్లు ఓటరు గుర్తిస్తే.. ఓటును తీసేయమని సంబధిత అధికారులను కోరే అవకాశం ఈ సెక్షన్ పౌరులకు కల్పించిందని వెల్లడించారు.